బైపాస్ బాగయ్యేదెన్నడో ?

- అధ్వానంగా మారిన సిరికొండ రోడ్డు
- అవస్థలు పడుతున్న ప్రజలు


ధ్వంసమైన సిరికొండలోని బైపాస్ రోడ్డు..


రోడ్డు పునర్నిర్మాణ పనులకు వేసిన శిలాఫలకం

సిరికొండ: మండల కేంద్రంలో గల బైపాస్ రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. మట్టి రోడ్డుగా ఉన్న బైపాస్ రోడ్డును పదేళ్ల క్రితం సీసీ రోడ్డుగా మార్చారు. బైపాస్ రోడ్డు నేల అడుగు భాగం నల్లరేగడి భూమి కావడంతో మట్టి కుంగిపోయి సీసీ రోడ్డు బీటలు వారింది. సీసీ రోడ్డు ధ్వంసమై ముక్కలు ముక్కలుగా మారి అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల సీసీ రోడ్డు ధ్వంసమైంది. దీనికి తోడు ఈ రోడ్డు గుండా అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో సీసీ రోడ్డు అధ్వాన్నంగా మారింది. సీసీ రోడ్డు పెచ్చులు పెచ్చులుగా లేచిపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. కార్ల లాంటి తక్కువ ఎత్తు వాహనాలు ఈ రోడ్డు గుండా వెళుతుంటే సీసీ రోడ్డు పెచ్చులు వాహనాల అడుగు భాగానికి తగులుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో ప్రతిభ స్కూల్ వద్ద నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఈ బైపాస్ రోడ్డు ఉంది. స్థానికులతో పాటు కొండూర్, పెద్దవాల్గోట్, పోతున్నార్ గ్రామాల ప్రజలు ఈ మార్గంలో మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రంలో గ్రామ నడిబొడ్డు నుంచి ఉన్న ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండటంతో బైపాస్ రోడ్డు ద్వారా నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ధర్పల్లి, డిచ్‌పల్లితో పాటు జిల్లా కేంద్రం వైపు వెళ్లే వారు ఈ మార్గంలో వెళ్తుంటారు. బైపాస్ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులున్నా నిష్ఫలం..

బైపాస్ రోడ్డులో తారు రోడ్డు పునర్నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా 2023లో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2023 సెప్టెంబర్ 13న తారు రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. బైపాస్ రోడ్డును త్వరగా బాగు చేయించాలని మండల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డితో పాటు జిల్లా స్థాయి అధికారులకు విన్నవిస్తున్నారు.

అధ్వానంగా మారింది

బైపాస్ రోడ్డు బాగా ధ్వంసమైంది. అధ్వానంగా మారిన బైపాస్ రోడ్డుతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. తారు రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డును త్వరగా బాగు చేయించాలి.

– తాళ్ల శ్రీనివాస్, సిరికొండ

నిధులు మంజూరయ్యాయి

బైపాస్ రోడ్డుకు గత ప్రభుత్వంలో మంజూరైన రూ.50 లక్షల నిధులు సరిపోవని కొత్తగా రూ.కోటి యాభై లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించగా నిధులు మంజూరయ్యాయి. టెండర్ త్వరలో ఖరారవుతుంది. టెండర్ పూర్తి కాగానే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తాం.

– హైమద్ హుస్సేన్, పీఆర్ డీఈ

క్లుప్తంగా

25న తైబజార్ బహిరంగ లీజు వేలం

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న తైబజార్, స్లాటర్ హౌస్(వధశాల) నిర్వహణ కోసం (2025–26 ఆర్థిక సంవత్సరం) బహిరంగ వేలం ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సమక్షంలో బల్దియా కార్యాలయంలో నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనేవారు ఈనెల 24న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తును డిపాజిట్ సొమ్ముతో కార్యాలయంలో సమర్పించాలి. మేకల వధశాల కోసం రూ.1,72,425, తైబజార్ కోసం రూ.13,37,875, పశువధశాల కోసం రూ. 6,34,150 రుసుము నిర్ణయించారు.

జిల్లా జైలులో వైద్య శిబిరం


ఖైదీలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని సారంగాపూర్ జైలులో టీబీ, హెచ్ఐవీ, హెపటైటిస్–బి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆనంద్‌రావు గురువారం తెలిపారు. 430 మంది ఖైదీలకు టీబీ స్క్రీనింగ్ నిర్వహించామని.. అందులో 27 మంది ఖైదీల తెమడ నమూనాలను సేకరించారని ఆనంద్ రావు తెలిపారు. జిల్లా టీబీ నియంత్రణ అధికారి దేవి నాగేశ్వరి, జైలర్ రాజశేఖర్ రెడ్డి, జైలు మెడికల్ ఆఫీసర్ దినేష్, జిల్లా టీబీ సమన్వయ కర్త రవిగౌడ్, డీపీఎం సుధాకర్, జైలు ఫార్మసిస్ట్ రాంచందర్, టీబీ సూపర్ వైజర్ స్రవంతి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం


శిబిరానికి హాజరైన ప్రజలు

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 26 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 15 మందికి మోతి బిందు ఆపరేషన్ల కోసం లయన్స్ కంటి ఆస్పత్రి(ఆర్మూర్)కి పంపించినట్లు మెడికల్ ఆఫీసర్ మౌనిక తెలిపారు ఆప్తాల్మిక్ అధికారి హరినాథ్ నెహ్రూ, వైద్య సిబ్బంది మురళి, పద్మ, సంతోష్, పూజ, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు పెంచాలి




తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీలో పీడీఎస్‌యు నాయకులు బడ్జెట్ ప్రతులను గురువారం దహనం చేశారు. నాయకులు ప్రిన్స్ మాట్లాడుతూ.. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, మోహిత్, హుస్సేన్, రాహుల్, భీమ్, ఆకాష్, తరుణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 66 మందికి రూ.18,93,000 విలువ గల చెక్కులు అందించినట్లు తెలిపారు. బీజేపీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

సిరికొండ: తాళ్లరామడుగులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపతిరెడ్డి సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు, డ్రైనేజీకి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. జీపీ ప్రత్యేకాధికారి ప్రవీణ్, నాయకులు బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, బండారి నరేష్, సొసైటీ వైస్ చైర్మన్ సాయిరి నర్సయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి


డైరీ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ హనుమంతు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ

నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ భరోసా ఇచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీని ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం.. ఉద్యోగుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘ భవనానికి ఇప్పటికే స్థలాన్ని కేటాయించామని, భవన నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు.

ఉద్యోగుల పాత్ర కీలకం: కలెక్టర్

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. పథకాలను పేదలకు చేరవేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పలు సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి అమత్ కుమార్, ఆయా శాఖల గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

'మైనారిటీల అభివృద్ధికి సహకారం'

నిజామాబాద్‌అర్బన్: తమ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి సహకారం అందిస్తోందని ప్రభుత్వ సలహా షబ్బీర్ అలీ అన్నారు. గురువారం టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని ఆయన ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేశారు.

బార్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు


ఆకుల రమేశ్, న్యాయవాది

ఖలీల్ వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గం పదవీకాలం మార్చి 31 పూర్తి అవుతున్న నేపథ్యంలో బార్ ఎన్నికల నిర్వహణకు సీనియర్ న్యాయవాది ఆకుల రమేష్ చైర్మన్‌గా, మరో ముగ్గురు సీనియర్ న్యాయవాదులు బాస రాజేశ్వర్, జి.నర్సింహారెడ్డి, శ్రీహరి ఆచార్య సభ్యులుగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ అడ్ హక్ కమిటీని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి నేతత్వంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ కార్యదర్శి వి.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. న్యాయవాదుల ఓటరు జాబితా తోపాటు 2025–2026 వార్షిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

నేడు అడ్ హక్ కమిటీ సమావేశం

సీనియర్ న్యాయవాది ఆకుల రమేష్ అడ్ హక్ కమిటీ చైర్మన్‌గా, న్యాయవాదులు బాస రాజేశ్వర్, జి.నరసింహారెడ్డి, శ్రీహరి ఆచార్య సభ్యులుగా శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసుకుని నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల విధివిధానాలను ప్రకటించనున్నారు.

కలెక్టరేట్‌లో చెత్త నిర్వహణ అధ్వానం


మొక్కల మధ్య తాగి పడేసిన టీ గ్లాసులు

నిజామాబాద్ అర్బన్: నిత్యం వందల మంది ఉద్యోగులు పనిచేసే కలెక్టరేట్ ఆవరణలో చెత్త నిర్వహణ అధ్వానంగా మారింది. అధికారులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే వారు తాగి పడేసిన టీగ్లాసులతో పాటు గుట్కా ప్యాకెట్లు మొక్కల మధ్య దర్శనమిస్తున్నాయి. రోజూ శుభ్రంగా ఊడవకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

భగత్‌సింగ్ 94వ వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌లను విడుదల చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి పోస్టర్‌లను గురువారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకవర్గాలు యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. యువకులు భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో విద్య బడుగు బలహీన వర్గాలకు అందడంలేదన్నారు. మతోన్మాద భావజాలాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం ఆందోళనకరమన్నారు. నాయకులు వనమాల సత్యం, భాస్కర్, రాజు, దేశెట్టి సాయి, ఎం.శివకుమార్, మోహన్, శంకర్, జి.రమేష్, సాయికిరణ్, ప్రేమ్ కుమార్, రేవంత్ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు

- తొలగించిన పోలీసులు


చెట్టును తొలగిస్తున్న ఎస్సై, సిబ్బంది

సిరికొండ: మండల కేంద్రం నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో తాళ్లరామడుగు వడ్డెర కాలనీ సమీపంలో రోడ్డుపై పడిన చెట్టును బుధవారం అర్ధరాత్రి పోలీసులు తొలగించారు. బుధవారం అర్ధరాత్రి గాలి భారీగా వీచింది. దీంతో భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై రామ్ సిబ్బందితో కలిసి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగించారు.

ప్రతి యువకుడు దేశ భక్తుడు కావాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెయూ శాఖ ఆధ్వర్యంలో శాఖ వార్షికోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రాంత కార్యవాహ డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. యువత స్వామివివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమై వంద ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. శాఖలో అభ్యాసం చేసే శారీరక అంశాలు నియుద్ధ(కరాటే), దండ(కర్రసాము), యోగసనాలు, వ్యాయాంయోగ్, సమత(పరేడ్) సామూహిక గీతాలను ప్రదర్శించారు. జిల్లా కార్యవాహ డాక్టర్ వారే దస్తగిరి, విభాగ్ కార్యవాహ లక్కారం చక్రధర్, మధు, శ్రీకాంత్, శ్రవణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

డిచ్‌పల్లి: గత 30 ఏళ్ల నుంచి మాదిగలకు జరుగుతున్న అన్యాయం గుర్తించి ఏబీసీడీ అనే నినాదంతో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఉద్యమాన్ని ప్రారంభించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగకు గురువారం డిచ్‌పల్లిలో పాలాభిషేకం చేశారు. సీనియర్ నేత గంధమాల నాగభూషణం మాట్లాడుతూ.. ఉద్యమ బాటలో ఎందరో మాదిగలు అసువులు బాశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విజయం వారికి అంకితమవుతుందన్నారు. డిచ్‌పల్లి మండల ఇన్‌చార్జి డప్పు నర్సయ్య, మోపాల్ ఇన్‌చార్జి సంఘం కిష్టయ్య, నడిపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం


కొండాపూర్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సిరికొండ: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాములు తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. సిరికొండ జెడ్పీహెచ్ఎస్‌లో బాలురు 46 మంది, బాలికలు 62 మంది, సిరికొండ ఆదర్శ పాఠశాలలో బాలురు 116 మంది, బాలికలు 101 మంది, కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో బాలురు 78 మంది, బాలికలు 53 మంది, పెద్దవాల్గోట్ జెడ్పీహెచ్ఎస్‌లో బాలురు 40 మంది, బాలికలు 73 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన వెల్లడించారు. నాలుగు కేంద్రాల్లో మొత్తం 569 మంది విద్యార్థులు ఉన్నట్లు ఎంఈవో వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయిలో రిటైర్డు ఉద్యోగులకు క్రీడా పోటీలు ఈ నెల 16 నుంచి 18 వరకు సూర్యాపేట జిల్లాలోని కోదాడలో నిర్వహించారు. ఇందులో పతకాలు సాధించిన రిటైర్డు ఉద్యోగులు జిల్లా రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. షటిల్‌లో గంగాధర్‌గౌడ్, జానయ్య, ఫాస్ట్ వాకింగ్లో మచ్చ రవికుమార్‌లు ద్వితీయస్థానంలో నిలిచి జిల్లాకు పతకాలు తెచ్చారు.

ప్రజావ్యతిరేక విధానాలను కలిసికట్టుగా ఎదుర్కోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఏఐకెఎంఎస్ జాతీయ నాయకుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవనగర్‌లో గంగుల నర్సన్న ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ఏఐకెఎంఎస్ నాయకులు భారీ ఎత్తున మాధవనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. కాలనీవాసుల పోరాటాలతోనే పట్టా ఇళ్లు వస్తాయన్నారు. పోరాటాలకు సిద్ధం కాకపోతే మనకు కూడు గుడ్డ నీడ దొరక్కుండా ప్రభుత్వాలు చేస్తాయన్నారు. నేతలు పల్ల మల్లేశ్, కత్తుల మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు వీడ్కోలు..స్వాగతం


లెక్చరర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ చంద్ర విఠల్

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని కళాశాలలో ప్రిన్సిపల్ సీహెచ్ చంద్రవిఠల్ అధ్యక్షతన వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. టీజీపీఎస్సీ ద్వారా నియమితులైన నూతన లెక్చరర్లు ఆర్.శ్రీనివాస్(కామర్స్), బి.రామకృష్ణారెడ్డి(భౌతికశాస్త్రం)లకు స్వాగతం పలికారు. కళాశాల నుంచి వీడ్కోలు తీసుకుంటున్న సి.లక్ష్మణ్(భౌతికశాస్త్రం), పి.నరేష్(తెలుగు), బి.విఠల్(కామర్స్)లను సన్మానించి వీడ్కోలు పలికారు. ప్రిన్సిపల్ చంద్రవిఠల్, బాలాజీ, మురళి, అర్చన, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం


ధర్నా చేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి: రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని టీయూసీఐ జిల్లా నాయకులు మురళి వ్యాఖ్యానించారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు ఆరు నెలలుగా రాకపోవడంతో గురువారం డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో 30 శాతం పీ ఆర్‌సీ అమలు చేయాలని, జీవో నెంబర్–51 సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న, నాయకులు కిషన్, సాయగౌడ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మోపాల్: మండలంలోని నర్సింగపల్లి ఇందూరు తిరుమలలో 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గంగోత్రి రామానుజ దాసు స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాలంటే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వర స్వామికి చాలా ఇష్టమని, లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు అంటే స్వామికి అత్యంత ప్రీతికరమని గంగోత్రి స్వామి అన్నారు. ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహించడం ఈ ప్రాంతానికి సుభిక్ష మని అన్నారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, యజ్ఞాచార్యులు శ్రీమన్నారాయణ శిఖామణి, శ్రీఖరాచార్యులు, సంపత్ కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య, ఆచార్య నరసింహమూర్తి, శ్రీధరాచార్య, నర్సారెడ్డి, నరాల సుధాకర్, భాస్కర్, ప్రసాద్, రమేశ్, మురళి, నరేందర్, సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,897	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	50	75	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1	కోర్ట్ 1.40, 7.30, 10.30
స్క్రీన్–2	ఎవడు సుబ్రహ్మణ్యం 10.50, 4.30 పెళ్లికాని ప్రసాద్ 1.40, 7.30 సో నైట్(ఇంగ్లీష్ 2డీ)–10.30
స్క్రీన్–3	షణ్ముక –1.30 సోనైట్(ఇంగ్లీష్2డీ)–4.30 ఆర్టిస్ట్7.30 – సలార్–పార్ట్–1 –10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1	ఛావా 10.00, 4.45, 10.45 అనగనగా ఆస్ట్రేలియాలో–1.20 షణ్ముక–8.05
స్క్రీన్–2	కోర్ట్–10.05, 4.30, 7.35, 10.40 ఛావా(హిందీ)–1.10
స్క్రీన్–3	కిస్ కిస్ కిస్సిక్–11.00, 7.30 షణ్ముక–1.50 – ఆర్టిస్ట్–4.30, 10.20
స్క్రీన్ –4	సలార్–పార్ట్–1–10.20, 4.25, 10.30 పెళ్లికాని ప్రసాద్–1.50, 7.55
లలితామహల్	కోర్ట్
దేవి	పెళ్లికానిప్రసాద్
నటరాజ్	షణ్ముక
విజయ్	సలార్